క్లుప్తంగా

కెంచమాంబదేవికి బంగారు నగల బహూకరణ



అర్చకుడికి బంగారు నగలు అందిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని కెంచమాంబదేవి అమ్మవారికి ముద్దప్ప అనే భక్తుడు రూ.8 లక్షల విలువైన బంగారు నగలను అందజేశారు. ముద్దప్ప కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం బంగారు ఆభరణాలను ఆలయ అర్చకుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

అమరాపురం: మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మహిళా కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజులు హాజరవుతారన్నారు. పంచాయతీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని కలిపి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ శేషగిరి కుమారుడు హనుమంతరాయుడు - శిరీష వివాహం ఆదివారం రొద్దంలో జరిగింది. పెళ్లి హాజరై నూతన వధూవరులను వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ ఆశీర్వదించారు. అలాగే మండలంలోని బూదిపల్లి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అశ్వర్థప్ప సమీప బంధువు కుమారుడి వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

అపహరించిన హుండీ లభ్యం



ఆలయం వద్ద దొరికిన హుండీ

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామ సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా పావగడ - పెనుకొండ ప్రధాన రహదారి పక్కన ఇటీవల పంచముఖ ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గుడిలో ఏర్పాటు చేసిన హుండీని శనివారం రాత్రి దొంగలు అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే ఆదివారం అదే స్థానంలో దుండగులు హుండీ వదిలి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఆంజనేయస్వామి మహిమతోనే దుండగులు చోరీ చేసిన హుండీని ధ్వంసం చేయకుండా ఆలయం వద్ద వదిలివెళ్లి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. హుండీలో భక్తులు సమర్పించిన కొంత నగదు ఉన్నట్లు తెలియేశారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షెక్షావలి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించుకోవాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కమిటీ ఎంపిక



ఐక్యతను తెలియజేస్తున్న నూతన కమిటీ సభ్యులు

పెనుకొండ: పెనుకొండ తాలూకా పీఆర్ ఉద్యోగుల కమిటీని స్థానిక ఎంపీడీఓ కార్యాలయపు సమావేశం భవనంలో ఆదివారం ఎంపిక చేశారు. ఎన్నికల అధికారి జగదీష్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. అధ్యక్షుడిగా టి.హరినాథ్, ఉపాధ్యక్షుడిగా నరసింగరావు, జనరల్ సెక్రటరీగా కే. జయవర్ధన్‌గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా మల్లికార్జున, ఎస్‌పీ చిరంజీవి, ట్రెజరర్‌గా గణేష్, జిల్లా కౌన్సిలర్లుగా షెక్షావలి, బీ.సుంకప్ప, గౌరవాధ్యక్షులుగా కళ్యాణి ఎంపికయ్యారు. ఎన్నికైన వారిని పలువురు పీఆర్ ఉద్యోగులు అభినందించి సన్మానించారు.

తగ్గిన మిర్చి సాగు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్వింటా రూ.34 వేలకు పైగా మద్దతు ధర
- ప్రస్తుతం క్వింటా రూ. 13 వేలలోపే...
- మద్దతు ధర లేకపోవడంతో ఆసక్తి చూపని అన్నదాతలు



మడకశిరరూరల్: వాణిజ్య పంటల్లో ప్రధానమైన మిర్చి పంట సాగుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఖర్చు పెరగడం, గిట్టుబాటు ధర దక్కకపోవడంతో మిరప పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. మిరప పంట సాగుకు ప్రస్తుతం అనుకూల సమయం అయినా ధర మళ్లీ పెరుగుతుందనే ఆశలేకపోవడంతో ఆ పంట జోలికి వెళ్లడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు.

2,100 ఎకరాల నుంచి 275కు పడిపోయి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏడాది మడకశిర డివిజన్‌లో 2,100 ఎకరాలకు తగ్గకుండా రైతులు మిరప పంటను రైతులు సాగు చేసి ఆదాయం పొందారు. గత ఏడాది మిర్చికి గిట్టుబాటు ధర దక్కకపోవడంతో ఈ ఏడాది మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు కేవలం 275 ఎకరాల్లో మాత్రమే మిరప పంటను సాగు చేశారు. గతంలో మిరప సాగు చేసే రైతులు ఎక్కువగా ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేస్తున్నారు.

ఆశాజనకంగా లేని ధరలు

ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు మాత్రమే ఉంది. ధర పెరగకపోవడంతో మిర్చి ధర పెరుగుతుందో లేదో అన్న అయోమయంలో రైతులు సాగుకు వెనుకడుగు వేస్తున్నారు.

గతమెంతో ఘనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పండించిన మిర్చికి గిట్టుబాటు ధర బాగుండడంతో రైతులు లాభాలు పొందారు. అప్పటిలో మిర్చి ధర క్వింటాల్ రూ. 32 వేల నుంచి రూ.34 వేల వరకూ ధర పలికింది. దీనికితోడు ఉచిత పంట బీమా సౌకర్యం కూడా ఉండేది. కూటమి ప్రభుత్వంలో అలాంటి గిట్టుబాటు ధర కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో అప్పులు చేసి సాగు చేసి పండించిన పంటకు ధర లేకపోతే నష్టపోవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఎక్కువ మంది పత్తి, మొక్కజొన్న, టమాట, రాగి తదితర పంటలు సాగు చేస్తున్నారు.

మద్దతు ధరలేక నష్టపోయాను



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మిర్చికి అధికంగా మద్దతు ధర ఉండడంతో మిరప పంట సాగు చేసి ఆదాయం పొందాను. గత ఏడాది బోరు బావి కింద ఎకరాలో మిరప పంట సాగు చేశాను. దిగుబడి కూడా బాగా వచ్చింది. కానీ మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడంతో దాదాపు రూ. 50 వేలకు పైగా నష్టపోయాను. అందుకే ఈ ఏడాది పత్తి పంటను సాగు చేశాను.

– నారాయణస్వామి, భీమరాయనపల్లి, మడకశిర మండలం

గిట్టుబాటు ధర లేకపోతే ఎలా?



గత ఏడాది అప్పులు చేసి రెండు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. దిగుబడి కూడా బాగా వచ్చింది. కానీ మార్కెట్‌లో మద్దతు ధర లేక రూ.లక్ష వరకూ నష్టపోయాను. కూటమి ప్రభుత్వంలో రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించలేదు. ఈ ఏడాది మిరప పంటను సాగు చేయకుండా రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. గిట్టుబాటు ధరలు లేకపోతే పంటలు ఎలా పండిస్తాము. ప్రభుత్వం ఆలోచించాలి.

– చిరంజీవి, తురుకువాండ్లపల్లి, మడకశిర మండలం

నీరు నిల్వకుండా చర్యలు



ఎల్లోటిలో రోడ్డుపై గుంతలకు జేసీబీతో మట్టి వేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మడకశిరరూరల్: మండలంలోని ఎల్లోటి గ్రామంలో ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు, మురికి నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టారు. 'చినుకు పడితే చిత్తడే' అన్న శీర్షిక సాక్షిలో నాలుగు రోజుల క్రితం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం గ్రామ కార్యదర్శి వరదరాజులు సిబ్బందితో కలిసి జేసీబీ ద్వారా రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు, మురికి నీటి గుంతలకు మట్టిని వేయించారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు నియమ నిష్ఠలతో ఇళ్లను శుభ్రం చేసి జ్యోతులను మోసుకుని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపుగా సమీపాన ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి జ్యోతులు సమర్పించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అమరాపురం: స్థానిక దక్షిణ గొల్లహట్టిలో వెలసిన కృష్ణుని ఆలయంలో శ్రీ కృష్ణ సత్యభామల కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణోత్సవాన్ని తిలకించారు.

క్రికెట్ టోర్నీ విజేత 'ఆలూడి'



ట్రోఫీతో ఆలూడి జట్టు సభ్యులు

అగళి: కోడిపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆలూడి భజరంగి బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అగళి – ఆలూడి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన అగళి జట్టు 83 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆలూడి జట్టు లక్ష్యాన్ని పూర్తి చేసింది. విజేతకు ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు, రన్నర్స్‌కు రూ.15 వేల నగదు, ట్రోఫీ అందించారు.

క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌కు 'రొద్దం'



బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డు అందుకుంటున్న నరేష్‌కుమార్

పెనుకొండ: రిటైర్డ్ టీచర్ దివంగత రామాంజినేయులు స్మారకార్థం జరుగుతున్న యూటీఎఫ్ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ తుది అంకానికి చేరుకుంది. ఆదివారం రొద్దం సూపర్ కింగ్స్ – చిలమత్తూరు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన చిలమత్తూరు 14 ఓవర్లలో 101 పరుగులు చేయగా, రొద్దం సూపర్ కింగ్స్ జట్టు 11 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్‌లో రొద్దం జట్టు కెప్టెన్ నరేష్‌కుమార్ 56 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. రొద్దం జట్టు ఫైనల్స్‌కు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.

పాలనలో 'కూటమి' విఫలం



వైబీ హళ్లిలో నిర్వహించిన మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

- ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: పరిపాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. మండల పరిధిలోని వైబీ హళ్లి పంచాయతీ కేంద్రంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు.

ఆడబిడ్డ నిధి అమలెప్పుడు?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున అందజేశారని ఈరలక్కప్ప తెలిపారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పి.. నేటికీ ఆ పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. అలాగే 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ ఇస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదన్నారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు.

స్త్రీశక్తి పథకం అమల్లోనూ మోసం

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలు చేసిన స్త్రీశక్తి పథకంలోనూ అనేక ఆంక్షలు విధించి మహిళాలోకాన్ని కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి విమర్శించారు. ఇప్పటికే పలు ఆర్టీసీ బస్సులపై స్త్రీ శక్తి పథకం వర్తించదని స్టిక్కర్లు వేశారని గుర్తు చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంతా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, ఎంపీపీ కవిత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యుడు రేకులకుంట హనుమంతరాయ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హనుమంతు, సర్పంచులు మూర్తి, రంగనాథ్, ఎంపీటీసీ రంగనాథప్ప, తాలుకా, మండల కమిటీల విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు, ఇన్‌చార్జ్ సభ్యులు నాగభూషణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, దొడ్డయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంజునాథ్, ముద్దప్ప, శేషాద్రి, మల్లికార్జున, హనుమంతేగౌడ్, పాండు, రంగనాథ్, రాజశేఖర్, విశ్వనాథ్, నరేష్‌రెడ్డి, గోపి, దేవరాజు, నరసింహ, రాజేష్, ధను, నగేష్ , లక్ష్మీనారాయణ, బాలు, మంజునాథ్, రాఘవేంద్ర, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చేదెన్నడో?



హిందూపురం: మండల పరిధిలోని చౌళూరులోని సచివాలయం ముందు వాటర్ పైపు లైను లీకేజీ అవుతుందని సిమెంటు రోడ్డు మధ్యలో గుంత తవ్వి వదిలేశారు. 45 రోజులు కావస్తున్నా ఆ గుంతను పూడ్చలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గుంత వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?



పావగడ: తాలూకాలోని కేటీ హళ్లి గ్రామ పంచాయతీ దేవళకెరె గ్రామంలోని ఎస్టీ కాలనీలో సీసీ రోడ్డు దెబ్బతింది. మురుగు వ్యవస్థ లేకపోవడంతో రోడ్లన్నీ కంపుగా మారాయి. రోడ్డు కూడా గుంతలు పడి కంకర తేలిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కియా ప్రాంతంలో అంధకారం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాబాఫక్రుద్దీన్ (ఫైల్)



అదుపుతప్పి గోయ్యిలోకి దూసుకెళ్లిన కియా బస్సు (ఫైల్)


- అరకొరగా ఉన్న విద్యుత్‌లైట్లూ వెలగని వైనం
- తరచూ రోడ్డు ప్రమాదాలతో స్థానికుల ఆందోళన

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమల రహదారులు అంధకారంగా మారాయి. ఏపీఐఐసీ కార్యాలయం పక్కనే ఉన్న ప్రాంతం ప్రధాన రహదారులు చీకటి పడితే అంధకారంలోకి మగ్గుతున్నాయి. దుద్దేబండ మలుపు మీదగా నేషనల్ పరిశ్రమ, కేఎస్‌హెచ్, సియాన్, టఫ్‌వే అనుబంధ పరిశ్రమల నుంచి కియా పరిశ్రమలోకి రాత్రుల్లో కూడా కంటైనర్ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అందుకే ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. విద్యుత్‌లైట్లు అరకొరగా ఉన్నప్పటికీ అవి కూడా రెండు నెలలుగా పనిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే గత నెలలో చంద్రగిరి గ్రామానికి చెందిన బాబా ఫక్రుదీన్ అనే కియా కార్మికుడిని అనుబంధ పరిశ్రమ నుంచి వెళ్తున్న కంటైనర్ వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. అలాగే అదే ప్రాంతంలోనే కియా కార్మికులను తరలించే ఓ బస్సు కూడా అదుపుతప్పి గొయ్యిలోకి దూసుకెళ్లింది. బస్సులో కార్మికులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టి కియా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసి తమ ప్రాణాలను కాపాడాలని స్థానికులతో పాటు కార్మికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా త్వరలో సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉయ్యాలోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

హిందూపురం: ఇస్కాన్ హరే కృష్ణ మూవెంట్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని సూగురు ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణుడి ప్రతిమలు, చిన్ని శ్రీకృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూపురం ఇస్కాన్ హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు భక్త బృందదాస్ ప్రవచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మరోవైపు శ్రీకృష్ణ జన్మష్టమి సందర్భంగా ముద్దిరెడ్డిపల్లి భాగ్యనగర్‌లో ప్రబోధసేవా సమితి త్రైత్రసిద్ధాంత నిర్వాహకుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జ్వరం కేసులు తగ్గుముఖం

హిందూపురం: మలుగూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం కూడా కె.బెవనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం విద్యార్థులకు చికిత్సలందించింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంత్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య బృందం జిల్లా సమన్వయ అధికారి డీసీఓ జయలక్ష్మి పర్యవేక్షణలో పిల్లల ఆరోగ్యం, ఇన్‌ఫెక్షన్‌కు ప్రధాన కారణాలను గుర్తించారు. నీటి లీకేజీ కారణంగా నీరు కలుషితం అయిండవచ్చన్నారు. లీకేజి పాయింట్లను గుర్తించి సరిచేయించారు. విద్యార్థుల జ్వరం కేసులు తగ్గాయన్నారు.



పైప్‌లైన్ లికేజీ సరిచేయిస్తున్న డీపీఓ జయలక్ష్మి



రొద్దంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



చౌళూరు ఉన్నత పాఠశాలలో..



పావగడ: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

హిందూపురం/రొద్దం/పావగడ: హిందూపురం మండలంలోని చౌళూరు పంచాయతీ జెడ్పీహెచ్ హైస్కూల్‌లో 2006–07 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. నాటి అపురూప జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే రొద్దం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. రూ.80 వేలు విలువచేసే ఇన్వర్టర్‌తో పాటు పాఠశాలకు విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు చేయించారు. పావగడ తాలూకాలోని దొడ్డహళ్లి మొరార్జి దేశాయి వసతి పాఠశాలలో 2015–16 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.